క్లుప్తంగా

అభినందన

భూపాలపల్లి రూరల్: మొగుళ్లపల్లి మండలం జెడ్పీహెచ్‌ఎస్ పాఠశాలలో ఈనెల 18న నిర్వహించిన 36వ సబ్ జూనియర్ కబడ్డీ క్రీడాకారుల ఎంపికల్లో భూపాలపల్లి మండలం కమలాపూర్ జెడ్పీహెచ్‌ఎస్ నుంచి బాలికల విభాగంలో అజ్మీరా అఖిల, బాలుర విభాగంతో కాల్వ రమేష్ ఎంపికైనట్లు ప్రధానోపాధ్యాయురాలు పద్మావతి తెలిపారు. ఎంపికైనా విద్యార్థులకు పాఠశాలలో శనివారం అభినందించారు. ఈ నెల 25 నుంచి నిజామాబాద్‌లో నిర్వహించే రాష్ట్ర స్థాయి క్రీడల్లో పాల్గొంటారని తెలిపారు. కార్యక్రమంలో సీనియర్ ఉపాధ్యాయుడు సురేష్, పీఈటీ నవీన్ తదితరులు పాల్గొన్నారు.

వైద్యపరీక్షలు



కాటారం: స్వస్థ్ నారీ సశక్త్ పరివార్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో మండల కేంద్రంలోని కేజీబీవీ పాఠశాలలో విద్యార్థినులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. బాలికల్లో ఉన్న రక్తహీనత గుర్తించడం కోసం హిమోగ్లోబిన్ రక్త పరీక్షలు చేశారు. ఈ సందర్భంగా డాక్టర్ మౌనిక మాట్లాడుతూ.. విద్యార్థినులు సరైన పౌష్టికాహారం తీసుకొని సంపూర్ణ ఆరోగ్యంతో ఉండాలని సూచించారు. బీపీ, షుగర్, థైరాయిడ్, కేన్సర్ దీర్ఘకాలిక వ్యాధుల గూర్చి విద్యార్థినులకు అవగాహన కల్పించారు. వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రత పాటించాలని తెలిపారు. ఈ వైద్య శిబిరంలో హెల్త్‌అసిస్టెంట్లు సమ్మయ్య, శ్యామల, ఎస్‌ఓ చల్ల సునీత వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల చేయూత

గోవిందరావుపేట : చల్వాయి ఉన్నత పాఠశాల అభివృద్ధికి పూర్వ విద్యార్థులు తమ వంతు చేయూతనందిస్తున్నారు. 1999–2000 విద్యా సంవత్సరంలో పదోతరగతి చదివిన పోలెపల్లి రమేశ్ ప్రస్తుతం హైదరాబాద్‌లో ఉద్యోగం చేస్తూ యునైటెడ్ హైదరాబాద్ అనే ఎన్జీఓ ద్వారా పాఠశాల అభివృద్ధికి తోడ్పడుతున్నారు. ఈ సందర్భంగా శనివారం ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు ఇంగ్లిష్ పాఠ్యపుస్తకాలను అందజేశారు. పూర్వ విద్యార్థులు సూరపనేని కుషాల్ కుమార్, పోలెపల్లి రమేశ్, మిట్టకంటి శ్రీనివాస్, దామల్ల సాంబయ్య, కవితను ఉపాధ్యాయులు, విద్యార్థులు అభినందించారు.

పెండింగ్ వేతనాలు చెల్లించాలి

ములుగు : ములుగు మున్సిపాలిటీలో పనిచేస్తున్న పారిశుద్ధ్య కార్మికుల పెండింగ్ వేతనాలు వెంటనే చెల్లించాలని కోరుతూ సీఐటీయూ ఆధ్వర్యంలో మున్సిపల్ కమిషనర్ సంపత్‌కు శనివారం వినతిపత్రం అందజేశారు. సీఐటీయూ జిల్లా కార్యదర్శి రత్నం రాజేందర్ మాట్లాడుతూ.. మూడు నెలలుగా వేతనాలు అందకపోవడంతో పారిశుద్ధ్య కార్మికులు ఇబ్బందులు పడుతున్నారని ఆరోపించారు. బతుకమ్మ,దసరా పండుగను దృష్టిలో పెట్టుకొని వేతనాలు అందించి కార్మికులను ఆదుకోవాలన్నారు. కార్మికులకు పీఎఫ్, ఈఎస్ఐ చెల్లించాలన్నారు. రవీందర్, మాట్ల జయాకర్, రఘు, భాస్కర్, కుమార్, రవి పాల్గొన్నారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభ్యం



భూపాలపల్లి అర్బన్: జిల్లా కేంద్రంలో గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభించినట్లు సీఐ నరేష్‌కుమార్ తెలిపారు. సీఐ తెలిపిన వివరాల ప్రకారం.. మృతి చెందిన వ్యక్తి సుమారు 40 నుంచి 45 సంవత్సరాల వయసు ఉంటాడన్నాడు. యాచకుడిగా అనావాళ్లు ఉన్నాయని ఆకలితో అలమటిస్తూ చనిపోయి ఉంటాడని తెలిపారు. ఎవరైన గుర్తుపట్టినట్లయితే 87126 58142, 87126 58120 నంబర్లకు ఫోన్ చేయాలని సూచించారు. మృతదేహాన్ని జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ జనరల్ ఆస్పత్రిలో భద్రపరిచినట్లు సీఐ వివరించారు.

నానో యూరియాపై వెనుకడుగు

- ఆసక్తి చూపని రైతులు
- యూరియా కోసం గంటల తరబడి క్యూలో నిరీక్షణ



యూరియా పంపిణీ కేంద్రం వద్ద రైతులు (ఫైల్)

రేగొండ: పంటలు సాగు చేసి మూడు నెలలు గడుస్తున్నా రైతులకు సరిపడా యూరియా అందడం లేదు. క్షేత్ర స్థాయిలో యూరియాకు బదులుగా నానో యూరియా వాడాలని వ్యవసాయ శాఖ అధికారులు సూచిస్తున్నా రైతులు నానో యూరియాపై ఆసక్తి చూపడం లేదు. నానో యూరియా వాడకం వల్ల పంటల ఎదుగుదల లోపిస్తుందని రైతులకు ఉన్న అపోహల్లో నిజం లేదని, నానో యూరియాతో అనేక ప్రయోజనాలు ఉన్నాయని వ్యవసాయ అధికారులు పేర్కొంటున్నారు. రేగొండ, కొత్తపల్లిగోరి మండలాలలోని పీఏసీఎస్, ఆగ్రోస్ కేంద్రాల్లో రైతులకు యూరియా పంపిణీ చేస్తున్నా, మండలానికి సరిపడా యూరియా రాకపోవడంతో అన్నదాతలు యూరియా కోసం అవస్థలు పడుతున్నారు.

35 వేల ఎకరాల్లో సాగు

రేగొండ, కొత్తపల్లిగోరి మండలాలలో సుమారు 35 వేల ఎకరాలల్లో పత్తి, వరి, మిర్చి, ఇతర పంటలు సాగు చేస్తున్నారు. పత్తి పంట సాగు చేసి 90 నుంచి 100 రోజులు, వరి పంట సాగు చేసి 50 నుంచి 60 రోజులు కావస్తోంది. అధికారులు యూరియా కొరత నేపథ్యంలో పంపిణీ కేంద్రాల్లో ఒక్కో రైతుకు ఒక బస్తా యూరియా మాత్రమే అందజేస్తున్నారు. 5 నుంచి 10 ఎకరాలు సాగు చేస్తున్న రైతులు యూరియా సరిపోక ఇబ్బందులు పడుతున్నారు. పంటలు ఎదిగే సమయంలో యూరియా లేకపోతే పంటల ఎదుగుదల తగ్గి, దిగుబడులపై తీవ్ర ప్రభావం చూపుతుందని అన్నదాతలు ఆందోళన చెందుతున్నారు.

ఐదెకరాల్లో సాగు చేస్తున్నా..



మూడు ఎకరాలలో పత్తి, రెండు ఎకరాలలో వరి సాగు చేస్తున్నా. యూరియా పంపిణీ కేంద్రంలో కేవలం 5 బస్తాల యూరియా మాత్రమే ఇచ్చారు. దీంతో పంటలకు సరైన మోతాదులో యూరియా అందించ లేకపోతున్నా. మొక్కల ఎదుగుదలా ఆగిపోయింది. యూరియా కొరత పంటల దిగుబడిపై తీవ్ర ప్రభావం చూపుతుంది.

-వన్నాల శివాజీ, రైతు, కొత్తపల్లిగోరి

నానో యూరియా వాడాలి



యూరియా కొరత నేపథ్యంలో డిమాండ్‌కు సరిపడా యూరియా సరఫరా జరగడం లేదు. రైతులు యూరియాకు బదులుగా నానో యూరియాను వాడాలి. ఒక బస్తా యూరియా రూ.266 గా ఉంది. నానో యూరియా 250 మి.లీ రూ.200కు దొరుకుతుంది. నానో యూరియాపై ఉన్న అపోహలను వీడాలి. నానో యూరియాతో పంటలకు మేలు కలుగుతుంది.

- పెద్ది వాసుదేవరెడ్డి, ఏఓ, రేగొండ

విద్యార్థులు పట్టుదలతో చదువుకోవాలి

- ప్రిన్సిపాల్ శ్రీదేవి



మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ శ్రీదేవి

చిట్యాల: విద్యార్థులు పట్టుదలతో కష్టపడి చదువుకోవాలని ప్రిన్సిపాల్ శ్రీదేవి అన్నారు. శనివారం మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో పేరెంట్స్–టీచర్స్ సమావేశం నిర్వహించారు. ముందుగా విద్యార్థుల అభ్యున్నతి కోసం వివిధ అంశాలపై చర్చించారు. అనంతరం ప్రిన్సిపాల్ శ్రీదేవి మాట్లాడుతూ.. ఈ సంవత్సరం విద్యార్థుల హాజరు శాతం పెరుగుదల కోసం ఎఫ్‌ఆర్‌ఎస్ ప్రారంభించినట్లు తెలిపారు. తద్వారా విద్యార్థుల తల్లిదండ్రులకు ఎప్పటికప్పుడు మేసేజ్ రూపంలో తెలియజేయడం జరుగుతుందని అన్నారు. స్పోర్ట్స్‌కు కేటాయించిన నిధులు, అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీలతో చేపట్టిన కళాశాల మరమ్మతుల గురించి వివరించారు. కళాశాలలో పని చేస్తున్న లెక్చరర్లు అంకితభావంతో పని చేస్తు విద్యార్థుల భవిష్యత్‌ను తీర్చిదిద్దుతున్నారని అన్నారు. ఈ కార్యక్రమంలో లెక్చరర్లు, నాన్ టీచింగ్ స్టాఫ్, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

సన్మానం



అరుణ్‌ని సన్మానిస్తున్న నాయకులు

టేకుమట్ల: మండలంలోని ఆశిరెడ్డిపల్లి గ్రామానికి చెందిన ఎల్కటి అరుణ్ ఇటీవల వెలువడిన నీట్ ఫలితాల్లో ఎంబీబీఎస్‌లో అర్హత సాధించాడు. దీంతో శనివారం ఆయనను అంబేడ్కర్ యువజన సంఘం నియోజకవర్గ కన్వీనర్ ఆరకొండ రాజయ్య, సీపీఐ ఎంఎల్ జిల్లా కార్యదర్శి మారెపెల్లి మల్లేశ్ సన్మానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఎంతో మంది నిరుపేదలకు ఆదర్శంగా నిలిచిన అరుణ్ మరింత ఎత్తుకు ఎదగాలని కోరారు. రమేశ్, రాకేశ్ ఉన్నారు.

ఇసుక అక్రమ రవాణా అరికట్టాలి



ర్యాలీ నిర్వహిస్తున్న బీఆర్‌ఎస్ నాయకులు

టేకుమట్ల: చలివాగు, మానేరుల నుంచి ఇసుక అక్రమ రవాణాను అరికట్టాలని బీఆర్‌ఎస్ నాయకులు శనివారం మండల కేంద్రంలో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. చలివాగు, మానేరుల నుంచి ఇందిరమ్మ ఇళ్ల పేరుతో అక్రమంగా ఇసుకను తరలిస్తున్నారని అన్నారు. కాంగ్రెస్ నాయకులే అక్రమంగా ఇసుక రవాణా చేస్తున్నారని ఆరోపించారు. అనంతరం కాంగ్రెస్ ప్రభుత్వ దిష్టిబొమ్మను దహనం చేసేందుకు యత్నించగా పలువురిని పోలీసులు అరెస్టు చేసి, పోలీస్‌స్టేషన్‌కు తరలించారు.

మండల కేంద్రంలో హై అలెర్ట్..

ఇసుక అక్రమ రవాణాను అరికట్టాలని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు కోటగిరి సతీశ్‌గౌడ్ ఆధ్వర్యంలో శుక్రవారం ర్యాలీ, ధర్నా నిర్వ హించిన సంగతి తెలిసిందే. కాగా అక్రమ ఇసుక రవాణాకు ప్రభుత్వమే బాధ్యత వహించాలని, బీఆర్‌ఎస్ నాయకులు శనివారం ప్రభుత్వ దిష్టిబొమ్మను దహనం చేసే కార్యక్రమాన్ని సోషల్‌మీడియా ద్వారా తెలుపడంతో కాంగ్రెస్ నాయకులు సైతం బీఆర్‌ఎస్ నాయకులను ఎదుర్కోనేందుకు సిద్ధమని తెలుపడంతో పోలీసులు బీఆర్‌ఎస్, కాంగ్రెస్ నాయకులను ముందస్తు అరెస్టు చేశారు. దీంతో ఉదయం నుంచి సాయంత్రం వరకు మండల కేంద్రంలో హై అలెర్ట్ చోటు చేసుకుంది. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా ఎస్సై దాసరి సుధాకర్ ఆధ్వర్యంలో పోలీసులు బందోబస్తు నిర్వహించారు.

బీఆర్‌ఎస్ నాయకుల నిరసన



చిట్యాల: ధర్నా చేస్తున్న బీఆర్‌ఎస్ నాయకులు



గణపురంలో..

అధికార కాంగ్రెస్ పార్టీ నాయకులే ఇసుక అక్రమ రవాణా దొంగలుగా మారారని బీఆర్‌ఎస్ నాయకులు ఆరోపించారు. శనివారం పలు మండలాల్లో బీఆర్‌ఎస్ నాయకులు ధర్నా నిర్వహించారు. అనంతరం వారు మాట్లాడుతూ.. టేకుమట్ల కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు కోటగిరి సతీశ్ ప్రతిపక్ష నేతలైనా మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి, బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షురాలు గండ్ర జ్యోతిలపై అనుచిత వ్యాఖ్యలను తీవ్రంగా ఖండిస్తున్నామని అన్నారు. అలాగే టేకుమట్ల మండల బీఆర్‌ఎస్ నాయకులను అక్రమంగా అరెస్ట్‌కు నిరసనగా, ఇసుక అక్రమ రవాణాను అరికట్టాలని డిమాండ్ చేస్తూ ధర్నా చేసినట్లు తెలిపారు.

– సాక్షి నెట్‌వర్క్

నిరుపేదలకు అండగా సీఎంఆర్‌ఎఫ్

- ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు



రేగొండ: మాట్లాడుతున్న ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు

రేగొండ: నిరుపేదలకు అండగా సీఎంఆర్‌ఎఫ్ పథకం నిలుస్తుందని ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు అన్నారు. శనివారం మండల కేంద్రంలోని రైతువేదికలో రేగొండ 52, కొత్తపల్లిగోరి 21 మంది లబ్ధిదారులకు సీఎంఆర్‌ఎఫ్ చెక్కులు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పేద ప్రజల అభ్యున్నతికి ప్రజాప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ శ్వేత, ఎంపీడీఓ వెంకటేశ్వరరావు, భూపాలపల్లి మార్కెట్ కమిటీ చైర్మన్ కిష్టయ్య, కోటంచ ఆలయ చైర్మన్ భిక్షపతి, ఎంపీఓ రాంప్రసాద్, నాయకులు పున్నం రవి, మొట్టె కిరణ్, సురేందర్ రెడ్డి, వీరబ్రహ్మం, దేవేందర్, తదితరులు పాల్గొన్నారు.

చెక్కుల పంపిణీ

భూపాలపల్లి రూరల్/గణపురం: పేదలకు అండగా సీఎం రిలీఫ్ ఫండ్ నిలుస్తుందని ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు అన్నారు. శనివారం జిల్లా కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం, గణపురం మండల కేంద్రంలోని రైతు వేదికలో ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను లబ్ధిదారులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పేద ప్రజలను ఆర్థికంగా ఆదుకునేందుకు సీఎం రేవంత్ రెడ్డి నేతృత్వంలోని ప్రజా ప్రభుత్వం అనేక సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నట్లు తెలిపారు. మానవతాదృక్పథంతో సీఎం రేవంత్ రెడ్డి దరఖాస్తు చేసుకున్న ప్రతీ ఒక్కరికి ఆర్థిక సాయం మంజూరు చేస్తున్నట్లు పేర్కొన్నారు.

తెలంగాణలోనే చెట్లను పూజించే సంస్కృతి

- మంథని మాజీ ఎమ్మెల్యే పుట్ట మధు



మహదేవపూర్‌లో జమ్మి మొక్క నాటుతున్న పుట్ట మధు

కాళేశ్వరం: దేశంలోని తెలంగాణ రాష్ట్రంలో చెట్లను పూజించే సంస్కృతి ఎక్కువగా ఉంటుందని మంథని మాజీ ఎమ్మెల్యే పుట్ట మధు అన్నారు. మాజీ రాజ్యసభ సభ్యుడు జోగినపల్లి సంతోష్ కుమార్ చేపట్టిన గ్రీన్ ఇండియా చాలెంజ్‌లో భాగంగా శనివారం మహదేవ్‌పూర్ మండల కేంద్రంలోని వీర బ్రహ్మేంద్రస్వామి, హనుమాన్ ఆలయాల ఆవరణలో జమ్మి చెట్లను నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జోగినపల్లి సంతోష్ కుమార్ ఆలోచన చాలా గొప్పదని, బావితరాల భవిష్యత్‌కు చెట్లు ఎంతో ఉపయోగపడుతాయన్నారు. గ్రీన్ ఇండియా చాలెంజ్ తీసుకోవడంతో పాటు చెట్లకు ప్రజలకు అనుసందానం చేసేలా కార్యక్రమాలు చేపడుతున్నాడని అన్నారు. రాష్ట్రంలో ఎక్కడైనా మొదట జమ్మి చెట్టును పూజించి దసరా వేడుకలు నిర్వహించుకోవడం ఆనవాయితీగా వస్తోందని, ఈ క్రమంలో ప్రతి ఆలయంలో జమ్మి చెట్టు ఉండాలని ఆయన ఆలోచనతో ఇక్కడ చెట్లు నాటామని తెలిపారు. ప్రతి ఒక్కరూ చెట్లను ప్రేమించాలని, రక్షించాలని పిలుపునిచ్చారు. గతంలో ఆలయ ఆవరణలో నాటిన జమ్మిచెట్టు వద్ద సెల్ఫీదిగారు.

పరామర్శ..

మండలం కేంద్రంలో సింగిల్ విండో డైరెక్టర్ దాసరి సమ్మయ్య తండ్రి వెంకయ్య గారు ఇటీవల మృతి చెదాడు. దీంతో బాధిత కుటుంబాన్ని పుట్ట మధు పరామర్శించారు. నార్లపురం సమ్మయ్యకు ఇటీవల గుండె శస్త్ర చికిత్స నిర్వహించడంతో పరామర్శించి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు.

చట్టాలపై అవగాహన ఉండాలి

ములుగు రూరల్ : చట్టాలపై ప్రతీ ఒక్కరికి అవగాహన ఉండాలని లీగల్ ఎయిడ్ ఛీఫ్ డిఫెన్స్ కౌన్సిల్ మేకల మహేందర్ తెలిపారు. శనివారం మండలంలోని ఇంచర్ల గ్రామంలో న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మద్యం తాగి వాహనాలు నడపడం నేరమన్నారు. రైతులు విత్తనాలు, ఎరువులు కొనుగోలు విషయంలో జాగ్రత్తలు పాటించాలన్నారు. నాసిరకం విత్తనాలు అయినట్లయితే వినియోగదారుల ఫోరంలో కేసు నమోదు చేసుకోవాలని వివరించారు. ఉచిత న్యాయం ఎలా పొందాలనే విషయాన్ని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ బానోత్ స్వామిదాస్, రైతులు పాల్గొన్నారు.

పాఠశాలల్లో బతుకమ్మ వేడుకలు

జిల్లా వ్యాప్తంగా ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల్లో శనివారం ముందస్తు బతుకమ్మ సంబురాలు నిర్వహించారు. విద్యార్థులు, ఉపాధ్యాయులు కలిసి వివిధ రంగుల పూలతో బతుకమ్మలను తయారు చేశారు. బతుకమ్మ పండగ విశిష్టతను ఉపాధ్యాయులు విద్యార్థులకు వివరించారు. అనంతరం అందరూ కలిసి ఉత్సాహంగా పాటలు పాడుతూ, బతుకమ్మ ఆడుతూ సందడి చేశారు.

- సాక్షి నెట్‌వర్క్



భూపాలపల్లి అర్బన్: బిట్స్ పాఠశాలలో బతుకమ్మ వేడుకల్లో ఉపాధ్యాయులు



చిట్యాల: బతుకమ్మ ఆడుతున్న ఉపాధ్యాయులు, విద్యార్థులు



భూపాలపల్లి అర్బన్: సంఘమిత్ర కళాశాలలో..



మొగుళ్లపల్లి: మోడల్‌స్కూల్‌లో..



కాళేశ్వరం: బతుకమ్మ ఆడిన చిన్నారికి బహుమతి అందజేస్తున్న ఉపాధ్యాయుడు



మహదేవపూర్ మండలం సూరారం పాఠశాలలో..



మల్హర్‌లో..



కాటారంలో..



కొత్తపల్లిగోరి పాఠశాలలో..



రేగొండ వాణివిద్యానికేతన్ పాఠశాలలో..

ప్రభుత్వం ఇచ్చిన మాట నిలబెట్టుకోవాలి



కాటారం: వినతిపత్రం ఇస్తున్న నాయకులు



కాళేశ్వరంలో..



మొగుళ్లపల్లిలో..



మల్హర్‌లో..

కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల ముందు ఇచ్చిన మాటను నిలబెట్టుకోవాలని ఎమ్మార్పీఎస్ నాయకులు కోరారు. ఇచ్చిన హామీ మేరకు దివ్యాంగులు, వృద్ధులు, వితంతువుల పింఛన్లు పెంచాలని శనివారం ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో పెన్షన్‌దారులు పలు మండల కేంద్రాల్లో, గ్రామాల్లో అధికారులకు వినతిపత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. పింఛన్లు పెంచి తమను ఆదుకోవాలని కోరారు.

- సాక్షి నెట్‌వర్క్



భూపాలపల్లి రూరల్: గోర్లవీడులో వినతిపత్రం ఇస్తున్న ఎమ్మార్పీఎస్ నాయకులు

శాంతిభద్రతల పరిరక్షణకు సహకరించాలి

మంగపేట : సమాజంలో శాంతిభద్రతల పరిరక్షణ, అసాంఘిక కార్యకలాపాలను అరికట్టేందుకు ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియా తమవంతు బాధ్యతగా పోలీసులకు సహకరించాలాని ఎస్సై సూరి కోరారు. పోలీస్ స్టేషన్‌లో శనివారం విలేకరులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సమాజంలో పెరుగుతున్న చట్టవిరుద్ధ కార్యక్రమాలు, అసాంఘిక శక్తులతో పాటు నిత్యం కనిపించే తప్పుడు విధానాలను మీడియా బాధ్యతగా వెలుగులోకి తెస్తేనే వాటిని నియంత్రించే అవకాశం ఉంటుందన్నారు. తప్పుచేస్తున్న వారు ఎవరైనా ఏ స్థాయి అధికారి అయినా ప్రజల్లో ప్రశ్నించే తత్వం వచ్చినప్పుడే న్యాయం జరుగుతుందన్నారు. దోపిడీ, అసాంఘిక కార్యకలాపాలు, గంజాయి విక్రయాలు, జూదం మీడియా, స్థానిక ప్రజల దృష్టికి వచ్చినా వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలన్నారు. మీడియా సమాజానికి నాలుగో స్తంభం వంటిదని ప్రతి సమాజ హితంకోసం నిజాలను నిర్భయంగా వెలుగులోకి తెస్తే మీడియాకు సమాజంలో విలువ పెరుగుతుందన్నారు.